క్లుప్తంగా

మద్యానికి బానిసలు కాకుండా అవగాహన కల్పించండి

కలెక్టర్ బాలాజీ



చిలకలపూడి(మచిలీపట్నం): మద్యానికి బానిస కాకుండా ఆయా ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం సాయంత్రం కేర్ కమిటీ జిల్లా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మద్యాన్ని తీసుకోవటం వల్ల కలిగే దుష్పరిణామాలపై ఆయా ప్రాంతాల్లో, ప్రధాన కూడళ్లలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో వైద్య ఆరోగ్య శాఖాధికారులను భాగస్వామ్యం చేసి మద్యానికి బానిసలైన వారిని డీఎడిక్షన్ సెంటర్లకు తరలించాలన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.గంగాధరరావు, ఏఈఎస్ భార్గవ్, డీసీహెచ్ఎస్ ఏవీ శేషుకుమార్, డీఈవో పీవీజే రామారావు, సాంఘిక సంక్షేమశాఖ డీడీ షేక్ షాహిద్‌బాబు, డీఎం అండ్‌హెచ్ఓ శర్మిష్ట, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

శుద్ధి చేసిన మంచినీటిని అందించటమే లక్ష్యం

మంత్రి కొల్లు రవీంద్ర



గుండుపాలెం(మచిలీపట్నంరూరల్): ప్రజలకు శుద్ధి చేసిన మంచినీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మండల పరిధిలోని గుండుపాలెం, వాడపాలెంలో మంగళవారం సాయంత్రం రూ.26 లక్షలతో నిర్మించిన 0.50 ఎంఎల్డి. మైక్రో ఫిల్టర్లను ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.2.50 కోట్లతో మండలంలోని పలు గ్రామాల్లో మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలోనే జలజీవన్ మిషన్ ద్వారా కృష్ణా నది నుంచి నేరుగా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి మంచినీటిని సరఫరా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అనంతరం కేపీటీ పాలెంలో నూతనంగా పునరుద్ధరించిన పంచాయతీ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జి.నాగరాజు, పంచాయతీ రాజ్ ఏఈఈ హరిబాబు, జిల్లా మార్కెట్ యార్డ్ కమిటీ మాజీ అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, స్థానిక ప్రముఖులు బండి రామకృష్ణ, తలారి సోమశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ప్రహరీ వెంబడి ఆక్రమణల తొలగింపు



మచిలీపట్నంటౌన్: నగరంలోని కలెక్టర్ కార్యాలయం ప్రధాన ద్వారం పక్కన ప్రహరీగోడ వెంబడి ఉన్న ఆక్రమిత గృహాలను నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగ సిబ్బంది మంగళవారం తొలగించారు. ఈ గృహాలను గత శనివారం నాడే తొలగించేందుకు ఎంఎంసీ సిబ్బంది రాగా గృహ యజమానులు మంగళవారం వరకు గడువు అడిగారు. గృహాలను యజమానులు స్వచ్ఛందంగానే ఖాళీ చేశారు. దీంతో ఈ గృహాలను తొలగించే పనులు మంగళవారం మధ్యాహ్నం నుంచి చేపట్టారు. ఈ గృహాల తొలగింపుతో కలెక్టరేట్ ప్రధాన ద్వారం నుంచి కెనడీ రోడ్‌కు మార్గం సుగమం కానుంది. ఈ ప్రాంతంలో రోడ్డును అభివృద్ధి చేసి వినియోగంలోకి వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కిట్‌లు పంపిణీ



కోనేరుసెంటర్: ఐక్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బందరు ట్రాఫిక్ పోలీసులకు మంగళవారం సమ్మర్ కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బందరు డీఎస్పీ సీహెచ్ రాజ ముఖ్య అతిథిగా పాల్గొని సిబ్బందికి కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ట్రాఫిక్ పోలీసుల బాధలను అర్థం చేసుకున్న ఐక్యం ఫౌండేషన్ సిబ్బంది ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కిట్‌లను అందజేయటం అభినందనీయమన్నారు. అనంతరం అక్షయ ఫ్యాషన్ యాక్సెసరీస్ ఆధ్వర్యంలో 20 నైట్ బ్యాటిల్స్, రేడియం జాకెట్‌లు, హ్యాండ్ గ్లౌసెస్, నాలుగు మెగా ఫోన్‌లను అందించగా డీఎస్పీ వారిని అభినందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ఏవీ శివకుమార్, ఎస్ఐలు ఎస్.వెంకటేశ్వరరావు, టి.మధుసూదనరావు, స్టేషన్ సిబ్బంది, ఐక్యం, అక్షయ ఫ్యాషన్ యాక్సెసరీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మార్జిన్లు వేయక సిమెంటు రోడ్లు ధ్వంసం

ఏడాదికే దెబ్బతింటున్న వైనం



మార్జిన్లు పోయకపోవడంతో కొట్టుకుపోతున్న ముక్కొల్లు శ్మశానం రోడ్డు అడుగు భాగం

గూడూరు: గ్రామాల్లో శాశ్వత ప్రాతిపదికన నిర్మిస్తున్న అంతర్గత రోడ్లు అధికారుల పర్యవేక్షణ లోపం... కాంట్రాక్టర్ల కక్కుర్తి కారణంగా అనతి కాలంలోనే ఛిద్రం అవుతున్నాయి. గూడూరు మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన రోడ్లే దీనికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తున్నాయి. ముక్కొల్లులోని రాముడు చెరువు నుంచి శ్మశాన వాటికకు వెళ్లేందుకు నిర్మించిన సీసీ రోడ్డుకు అరకొర మార్జిన్లు వేసి చేతులు దులుపుకొన్నారు. ఫలితంగా ఏడాది పూర్తవకుండానే పలు చోట్ల రోడ్డు పగుళ్లు ఇచ్చింది. కంచాకోడూరులో ఆర్బీకే, మార్కెట్ యార్డు గోదాములకు వెళ్లేందుకు నిర్మించిన సిమెంటు రోడ్డు కూడా మార్జిన్లు వేయకుండా వదిలేశారు. మార్కెట్ యార్డు గోదాములు అధిక లోడుతో ఉన్న వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అసలే పొలాల మధ్యలో వేసిన రోడ్డు కావడంతో భారీ వాహనాల వల్ల దెబ్బతింటుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిట్టిగూడూరులో అంగన్‌వాడీ కేంద్రం, ఐటీఐ కళాశాల రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. చెరువు గట్టు వెంబడి రోడ్డు నిర్మించడం వల్ల గట్టు కోతకు గురైంది. దీంతో మార్జినంతా కొట్టుకుపోయి రోడ్డు అడుగు భాగం డొల్లగా మారింది. వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో ఏ క్షణమైనా రోడ్డు కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

పదికాలాల పాటు ఉండాల్సిన సిమెంటు రోడ్లు నిర్మాణ లోపాలు, నిర్వహణ లోపాల కారణంగా ఛిద్రమవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రోడ్ల పర్యవేక్షణ గాలికొదిలేయడం వల్ల ప్రభుత్వం ఆశించిన ప్రయోజనం చేకూరకపోగా, ప్రజలు మరిన్ని కష్టాలపాలవ్వాల్సిన పరిస్థితి ఉత్పన్నం అవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడవుతున్న రోడ్లకు యుద్ధప్రాతిపదికన రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



చిట్టిగూడూరు అంగన్‌వాడీ కేంద్రం ఎదుట రోడ్డు మార్జిన్ భారీగా కొట్టుకుపోయిన దృశ్యం

తల్లీబిడ్డల ఆరోగ్యమే లక్ష్యం

ఘంటసాల: తల్లీ బిడ్డల ఆరోగ్యమే లక్ష్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని ఘంటసాల మండల ఐసీడీఎస్ సూపర్ వైజర్లు టి.రమా నాగమణి, డి.మేరీ అన్నారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమావేశపు హాలులో మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఘంటసాల మండలం అంగన్‌వాడీ కార్యకర్తలతో పోషణ్ పక్వాడా ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన ఆకు కూరల పకోడి, రాగి, నువ్వుల లడ్డు తదితర పౌష్టికాహారంతో కూడిన పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త కె.కృష్ణవేణి, ఏఎన్ఎంలు సునీత, రాణి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలి

మచిలీపట్నంటౌన్: ప్రతి గర్భిణి, బాలింత పోషకాహారాన్ని తీసుకుని బిడ్డ సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఐసీడీఎస్ మచిలీపట్నం అర్బన్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ జి.మాలతీదేవి సూచించారు. నగరంలోని ఐసీడీఎస్ నారాయణపురం సెక్టార్ పరిధిలోని ఈడేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాలతీదేవి గర్భిణులు, బాలింతలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డకు రెండేళ్ల వయస్సు వచ్చే వరకూ వారి సంరక్షణపై పూర్తిగా శ్రద్ధ వహించాలన్నారు. ఈ సందర్భంగా సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు.

గర్భిణులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

చల్లపల్లి: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవటంతో పాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత కూడా తప్పనిసరిగా పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ ఆదిలక్ష్మి సూచించారు. ఈనెల 8వ తేదీన ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రారంభమైన పోషణ పక్వాడ కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు స్థానిక నారాయణరావునగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు, తల్లులకు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ గర్భం దాల్చిన నాటి నుంచి శిశువుకు రెండు సంవత్సరాలు వచ్చేవరకూ వారి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ సైకం నాగలక్ష్మి, ఎం.ఎల్.హెచ్.పి. ఎ.సునీత, ఆశ వర్కర్ సీతారావమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.



ఘంటసాలలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమా నాగమణి

పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని పదిలం చేసుకోండి

పెడన: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. స్థానిక 8వ వార్డు గుణ్ణానపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద మంగళవారం పోషణ్ పక్వాడ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పవల్లి అధ్యక్షత వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాల స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వైవీ హరనాథ్, పెడన పీహెచ్‌సీ వైద్యాధికారి మీనాదేవి, సూపర్‌వైజర్ నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

కృత్తివెన్ను: గర్భం దాల్చిన నాటి నుంచి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామలగౌరి అన్నారు. పెదచంద్రాల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గర్భవతిగా నమోదైన దగ్గర నుంచి పోషకాహారం తీసుకుంటూ కాన్పు సమయానికి 10 నుంచి 12 కేజీల బరువు పెరగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎస్.పోతురాజు, స్థానిక పెద్దలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఈడేపల్లిలో గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాలతీదేవి

రక్తహీనతపై అవగాహన కల్పించాలి

ఘంటసాల: గర్భిణులకు, బాలింతలకు రక్తహీనత గురించి అవగాహన కల్పించాలని గుంటూరు లాం సామాజిక కళాశాల రిటైర్డ్ డీన్ డాక్టర్ సీహెచ్ చిరంజీవి అన్నారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో పోషణ్ పక్వాడా ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ చిరు ధాన్యాలు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. సేంద్రియ ఎరువుల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటలు పెంచి ఆరోగ్యవంతమైన ఆహారాన్ని గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు అందించాలన్నారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి, కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో పోషణ్ పక్వాడ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ముందుగా డాక్టర్ చిరంజీవిని దుశ్శాలువా, మెమెంటోతో డాక్టర్ సుధారాణి సత్కరించారు. అనంతరం పోషకాహారంతో తయారు చేసిన పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వి.మంజువాణి, జె.యశ్వంత్ కుమార్, డాక్టర్ కె.రేవతి, డాక్టర్ బి.నవీన్, ఐసీడీఎస్ ఘంటసాల మండల సూపర్ వైజర్లు టి.రమా నాగమణి, డి.మేరీ, ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీలు, ప్రకృతి వ్యవసాయం రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సారా విక్రేత బైండోవర్

పెడన: సారా విక్రయం కేసులో రెండు నెలల కిందట అరెస్టు అయి స్టేషన్ బెయిల్‌పై ఉన్న ఎ. నాగరాజును మంగళవారం ఎక్సైజ్ పోలీసులు ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ ఎదుట హాజరుపరిచారు. ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్ నాగరాజును బైండోవర్ చేస్తున్నట్లు ప్రకటించారు.

నిరుపేదలకు భోజనాలు పంపిణీ

పెడన: పట్టణ శివారు బలిపర్రు కాలనీలోని నిరుపేదలకు మంగళవారం సుఖీభవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజనాలను పంపిణీ చేశారు. తోకల సత్యనారాయణ ఆర్థికసాయంతో భోజనాల ప్యాకెట్లను అందజేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అద్దంకి నాగశంకర్ తెలిపారు.

ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలి

చల్లపల్లి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 చొప్పున వేతనం ఇచ్చి పనిముట్ల మరమ్మతుల కోసం అదనంగా నిధులు మంజూరు చేయాలని ఎ.పి. వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు యద్దనపూడి మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని వక్కలగడ్డలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను మంగళవారం ఆయన కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. పని చేసే ప్రాంతంలో టెంట్లు ఏర్పాటుచేసి కూలీలకు ప్రతిరోజూ మంచినీళ్లు, మజ్జిగ పంపిణీ చేయాలని, మందులు అందుబాటులో ఉంచాలని కోరారు.

ఘంటసాలపాలెంలో...

ఘంటసాలపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలం ఘంటసాలపాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మేడంకి వెంకటేశ్వరరావు, వాకా రామచంద్రరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడగా వారు రెండు నెలలుగా సక్రమంగా వేతనాలు ఇవ్వడం లేదని, 100 రోజుల పనిదినాలు కల్పించడం లేదంటూ వాపోయారు.

వెంకటాపురంలో...

వెంకటాపురం(మోపిదేవి): జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి చిరువెళ్ల రాఘవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వెంకటాపురంలో ఉపాధి కూలీల సమస్యలను మంగళవారం ఆయన అడిగి తెలుసుకున్నారు. పనిదినాలు 200 రోజులకు పెంచాలని, కనీస వేతనం రోజుకు రూ.600 చేయాలని డిమాండ్ చేశారు.

ఏజే కళాశాల ఆవరణలో అగ్ని ప్రమాదం

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఆంధ్ర జాతీయ కళాశాల ఆవరణలోని సాగుభూమి మైదానంలో మంగళవారం మధ్యాహ్నం కార్చిచ్చు రగిలి ఆ ప్రాంత ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. మధ్యాహ్నం కళాశాల సిబ్బంది చెత్తకు నిప్పు పెట్టడంతో గాలులకు మంటలు ఎగసిపడి ఆవరణలోని ఎండిన గడ్డి, మొక్కలు, చెత్తకు అంటుకుని కార్చిచ్చు అలుముకుంది. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోవటంతో పరిసర నివాసులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

విద్యార్థులు ఆసక్తితో చదువుకోవాలి

పెడన: విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై ఆసక్తితో చదువుకోవాలని పెడన ఎంఈవో-2 వైవీ హరనాథ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక (బంగ్లా) స్కూల్లో మంగళవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు, విచిత్ర వేషధారణలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో దాత మట్టా రాధాకృష్ణమూర్తి, హెచ్ఎం ఎ.భాగ్యలక్ష్మి, ఎస్ఎంసీ చైర్ పర్సన్ సుధారాణి, వైస్ చైర్మన్ బాబు పాల్గొన్నారు.

ముగిసిన వార్షికోత్సవ పూజలు

కృత్తివెన్ను: మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో గత మూడు రోజులుగా జరుగుతున్న శ్రీ సీతారామచంద్రులు, వేణుగోపాలకృష్ణ స్వామివార్ల 17వ వార్షికోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఆలయం వద్ద శాంతికల్యాణం నిర్వహించి అనంతరం భారీ అన్నసమారాధన చేశారు.

అగ్నిప్రమాదాలపై ఆసుపత్రి సిబ్బందికి అవగాహన

చల్లపల్లి: అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక కస్తూరిబా కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం వైద్యులకు, సిబ్బందికి మంగళవారం మొవ్వ అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ నుంచి వస్తున్న మంటలు ఎలా అదుపుచేయాలి, ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై అగ్నిమాపక అధికారి కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది పూర్ణచంద్రరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు ప్రత్యక్షంగా చేసి చూపించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.ఎస్.శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పర్యావరణ యోధులుగా మారాలి

రుద్రవరం (మచిలీపట్నంరూరల్): విద్యార్థులు పర్యావరణ యోధులుగా మారాలని కృష్ణా యూనివర్సిటీ వీసీ కె.రాంజీ పిలుపునిచ్చారు. వర్సిటీలో మంగళవారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థులు, అన్ని రంగాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన జీవనశైలి అలవర్చుకుని ముందుకు సాగాలన్నారు. రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని, ప్రతి ఏడాది కనీసం ఒక మొక్క నాటి దాన్ని సంరక్షించాలని, శుభ్రత, పచ్చదనం కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రకృతి పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యాపకులు పాల్గొన్నారు.

హెటిరో లాబ్స్‌కు 37 మంది విద్యార్థులు ఎంపిక

రుద్రవరం(మచిలీపట్నంరూరల్): కృష్ణా యూనివర్సిటీలో మంగళవారం జరిగిన ప్రాంగణ ఎంపికల్లో హెటిరో ల్యాబ్స్ కు 37 మంది విద్యార్థులు ఎంపికైనట్లు వీసీ కె.రాంజీ తెలిపారు. ప్రాంగణ ఎంపికల్లో ఫార్మసీ, రసాయన శాస్త్రం విభాగాలకు చెందిన 96 మంది విద్యార్థులు పాల్గొనగా, 37 మంది అర్హత సాధించారని చెప్పారు. కార్యక్రమంలో రెక్టర్ ఎంవీ బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఎన్.ఉష, రసాయన శాస్త్ర విభాగ అధిపతి సుజాత, కిశోర్, హెటిరో లాబ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి

చిలకలపూడి(ఘంటసాల): నిష్ణాతులైన ఉపాధ్యాయులు పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఘంటసాల ఎంఈవో 1 ఎన్.శివ శంకరరావు అన్నారు. ఘంటసాల మండలం చిలకలపూడి గ్రామంలో బడి ఈడు పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ ఎంఈవో ఆధ్వర్యంలో మంగళవారం ఎన్‌రోల్‌మెంట్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో శివశంకరరావు స్థానిక పాఠశాల హెచ్ఎం కె.రత్నజ్యోతి, ఉపాధ్యాయుడు జి.భగవాన్‌తో కలసి ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించే సౌకర్యాలను, ఉచిత పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాలలో రోల్ పెంచేందుకు ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ కృషి చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నాలుగు అడ్మిషన్లు వచ్చినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

న్యూకమ్మనమోలు డ్రైన్ పూడిక తీయించండి

మండల పరిషత్ సమావేశంలో సర్పంచ్ ఉదయభాస్కర్ వినతి



ఎంపీపీ రాఘవరాణి, ఎంపీడీఓలకు వినతిపత్రం ఇచ్చిన సర్పంచ్ మండలి ఉదయభాస్కర్

నాగాయలంక: మండలంలోని భావదేవరపల్లి పరిధిలో రైతులకు విస్తృత ప్రయోజనాలు కలిగించే న్యూ కమ్మనమోలు డ్రైన్ పూడికను సత్వరమే తీయించాలని ఆ గ్రామ సర్పంచి మండలి ఉదయభాస్కర్ డిమాండ్ చేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ భోగాది రాఘవరాణి అధ్యక్షతన ఎంపీడీఓ సుధాప్రవీణ్ నిర్వహణలో మంగళవారం జరిగింది. వివిధ శాఖల అధికారులతో సమీక్షలో డ్రైనేజీ అధికారులు గైర్హాజరు కావడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటూ సర్పంచి ఉదయభాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యూ కమ్మనమోలు డ్రైన్ అవనిగడ్డ మండలం బందలాయిచెర్వు నుంచి భావదేవరపల్లి మీదుగా రత్నకోడు మేజర్ డ్రైన్‌లో కలుస్తుందని, భారీవర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ లోపు డ్రైన్ పూడిక తీయించాలని, దీనిపై తూర్పు దళితవాడ వద్ద కల్వర్టు నిర్మించాలని కోరారు. ఈమేరకు ఎంపీడీఓకు వినతి పత్రం సమర్పించారు. పంచాయతీ పరిధిలోని కమ్మరిపాలెంలో శ్మశానవాటిక లేనందున చెరువు పక్కన ప్రభుత్వ భూమిలో 10 సెంట్లు స్థలం కేటాయించాలని ఉదయభాస్కర్ మరో వినతిపత్రం ఇచ్చారు. ఎంఈఓ-2 రామారావు మాట్లాడుతూ మండలంలో 10 మోడల్ పాఠశాలలకు, కమ్మనమోలు, నంగేగడ్డ యూపీ స్కూల్స్‌ను అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. వ్యవసాయాధికారి సంజీవరావు మాట్లాడుతూ రైతులు పంట వేయగానే ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలో 770 భూసార పరీక్షలకు గాను ఇప్పటికి 150 వరకు పూర్తి చేశామన్నారు. ఉపాధి హామీ ఏపీఓ టీవీఎస్ ముత్యాలు మండలంలో 1027 జాబ్‌కార్డులు జారీ చేశామన్నారు. ఈఓపీఆర్‌డీ కె.అప్పలనరసమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి రూ.లక్ష ఆర్థిక సాయం

మచిలీపట్నంటౌన్: స్థానిక టెంపుల్ కాలనీకి చెందిన ఎండీ సుభాని, జరీనా దంపతులకు 10 రోజుల క్రితం పాప జన్మించగా రక్తంలో ఇన్ఫెక్షన్‌తో పాటు ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా అత్యవసర చికిత్స కోసం విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. కూలి పనులు చేసుకుని జీవనం సాగించే సుభాని రూ.4 లక్షలు అప్పు చేసి వైద్యానికి ఖర్చుపెట్టారు. అయినప్పటికీ పాప పూర్తిగా కోలుకోవడానికి ఇంకా రూ.3 లక్షలు అవసరం కాగా నగరానికి చెందిన మైత్రి ఫౌండేషన్‌ను సంప్రదించారు. దీంతో ఫౌండేషన్ సభ్యులు, దాతలు, బాధిత కుటుంబ స్నేహితులు కలిసి లక్ష రూపాయల విరాళాలు సేకరించి మంగళవారం ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఆయన సోదరుడు కొనకళ్ల జగన్నాథరావు(బుల్లయ్య) చేతుల మీదగా బాధిత కుటుంబానికి అందించారు. మైత్రీ ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ చిలంకుర్తి దీప్తి, సభ్యుడు అభిజిత్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఒ.వేణుకుమార్, ఉపాధ్యక్షుడు రిలాక్స్ ప్రసాద్, కార్యదర్శి రాధాకృష్ణ, సభ్యులు వక్కంటి రమాదేవి పాల్గొన్నారు.



రూ.లక్ష నగదును అందజేస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, మైత్రీ ఫౌండేషన్ ప్రతినిధులు

చెత్త నిల్వలు డంపింగ్ యార్డుకు తరలింపు

సాక్షి ఎఫెక్ట్

పెడన: పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త నిల్వలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో 'సాక్షి' పత్రికలో మంగళవారం 'సిబ్బంది తక్కువ...చెత్త ఎక్కువ' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా చెత్త నిల్వలు లేకుండా చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు ఆదేశాలతో శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ హరికిషోర్ పారిశుద్ధ్య కార్మికులకు సూచనలు జారీ చేశారు. దీంతో వెహికల్ పాయింట్‌లోని ట్రాక్టరు ట్రక్కులోని చెత్తతో పాటు పెడన శాఖ గ్రంథాలయం, గూడూరు రోడ్డులోని 1వ వార్డులోని చెత్త నిల్వలను తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. ఎప్పటికప్పుడు చెత్త నిల్వలను తొలగించాలని, తగిన సిబ్బందిని నియమించాలని పుర ప్రజలు కోరుతున్నారు.



పెడన శాఖ గ్రంథాలయం వద్ద చెత్త నిల్వలు తీసేయడంతో పరిశుభ్రంగా ఉన్న రోడ్డు

గొల్లమంద రోడ్డు పరిశీలించిన ఏఐఐబీ ప్రతినిధులు

ఎదురుమొండి(నాగాయలంక): కృష్ణానది కోతకు గురవుతున్న ఎదురుమొండి శివారు గొల్లమంద రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.13.45 కోట్లు నిధులు కేటాయించిన నేపథ్యంలో మంగళవారం నది కోత తీరును ఏషియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ) ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈ బృందంలో బ్యాంకు ప్రాజెక్ట్ టీమ్ లీడర్ పవన్ కార్కి, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, సోషల్ ఎక్స్‌పర్ట్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఎక్స్‌పర్ట్ యోగేష్, బ్యాంకు ఎన్విరాన్‌మెంట్ ఎక్స్‌పర్ట్ మాయ, ప్రొక్యూర్‌మెంట్ స్పెషలిస్ట్ లార్లా ఉన్నారు. పంచాయతీరాజ్ డీఈఈ నాగరాజు, ఏఈఈ రాజశేఖరరెడ్డి గ్రామస్తులతో కలసి ప్రతినిధులు నదికోతకు విరిగి పడుతున్న రోడ్డును పరిశీలించారు.



గొల్లమంద ప్రజలతో మాట్లాడుతున్న ఏఐఐబీ ప్రతినిధులు

విద్య ద్వారానే ఉన్నత స్థాయి

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ: చదువు ద్వారానే పేదరికాన్ని జయించి ఉన్నత స్థాయికి ఎదగవచ్చని శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన వారిని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇంటర్ సెకండియర్‌లో మంచి మార్కులు సాధించిన వసతి గృహ విద్యార్థినులు నాయుడు శ్యామలీల, కై తేపల్లి మేఘన, ఫస్టియర్ విద్యార్థిని ఆరేపరపు సాయి నవ్యశ్రీని, హాస్టల్ వార్డెన్‌ను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు.



మెరిట్ విద్యార్థినులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

విద్యార్థులకు దంత పరీక్షలు

మచిలీపట్నంటౌన్: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని పలు పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. నగరంలోని ఏయూపీఏ స్కూల్, సరస్వతి ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ స్కూల్, శ్రీ వేంకటేశ్వర ఇంగ్లిషు మీడియం హైస్కూల్, జార్జ్ కార్నేషన్ హైస్కూల్‌లో మొత్తం 1300 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఐడీఏ జిల్లా శాఖ అధ్యక్షురాలు ఉషాకాంతి, కార్యదర్శి థియోఫిలస్ గుంజా, దంత వైద్యులు రామకృష్ణ, యువరాజ్, స్నేహ, కిరణ్, సాయి తేజ, రఘు, దీప్తి, సంతోషి, అనూప్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిలకలపూడి(మచిలీపట్నం): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ జి.గోవిందరావు తెలిపారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఇనకుదురుపేట పోలీస్ స్టేషన్, బుర్రా వారి వీధి, జైహింద్ హైస్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.